క్లుప్తంగా

వైద్య శిబిరం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం అమృత ట్రూలైఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మహిళలు, పురుషులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్టు సాల్విన కాంత్, జనరల్ ఫిజిషియన్ విగ్నేశ్వర్, చర్చి కమిటీ ప్రతినిధులు పాస్టర్ అనీల్, ఎడ్వర్డ్, జ్యోతిరాజ్, సందీప్, దాస్ తదితరులున్నారు.

స్నేహితుడి కూతురు పెళ్లికి ఆర్థిక సాయం



డొంకేశ్వర్(ఆర్మూర్): స్నేహితుడి కూతురి పెళ్లికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదర్శంగా నిలిచారు డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 1991–91 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు. ఆదివారం నూత్‌పల్లిలో జరిగిన జన్నెపల్లి శంకర్ కూతురి వివాహానికి హాజరై ఆర్థిక సాయాన్ని అందజేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. స్నేహితుల గొప్పతనాన్ని చాటుకుని ప్రశంసలు అందుకున్నారు.

ప్రశాంతంగా 'గురుకుల' పరీక్ష



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద సాంఘిక సంక్షేమ గురుకుల, తెలంగాణ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాల్లో 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

ఎడపల్లిలో..



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఐదవ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులకు గాను 227 మంది హాజరయ్యారు.

బొప్పాపూర్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

రుద్రూర్: రుద్రూర్ మండలం బొప్పాపూర్ గ్రామ కాంగ్రెస్ కమిటీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఓబీసీ జిల్లా కార్యదర్శి పట్ల సురేష్ తెలిపారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా దత్తు, ప్రధాన కార్యదర్శిగా పట్ల స్వామి, ఉపాధ్యక్షుడిగా పెర్క అబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పవన్ కుమార్



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్(కేబీఏ) అధ్యక్షుడిగా చిలివేరి పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం కేబీఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జోగ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా గణపురం రవి, కోశాధికారిగా చింత ప్రదీప్ కుమార్, సహాయ కార్యదర్శిగా సుంకెట రమేశ్‌లను ఎన్నుకున్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి



భారతి, ఏఎన్ఎం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట పీహెచ్‌సీ పరిధిలో తల్వేద ఏఎన్ఎంగా పనిచేస్తున్న భారతి (45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. నందిపేటలో విధులు నిర్వహించిన అనంతరం ఆమె నివాసముంటున్న నిజామాబాద్‌కు వెళ్లారు. సాయంత్రం ఇంటి చేరుకున్న తర్వాత ఛాతీలో నొప్పి రావడంతో తన తమ్ముడికి సమాచారం అందించడంతో అయన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మల్లన్నా.. నీ గుట్టకు ఎట్లా రావాలన్నా!

- అసంపూర్తిగా గుట్ట రోడ్డు
- కంకర వేసి వదిలేసిన వైనం



కంకర వేసి వదిలేసిన మల్లన్న గుట్ట రోడ్డు

బాల్కొండ: మండల కేంద్రంలో మల్లన్నగుట్ట దారిపై బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేసి వదిలేశారు. దీంతో మల్లన్న.. నీ గుట్టకు ఎట్లా రావాలన్నా అంటూ భక్తులు వాపోతున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న మల్లన్న గుట్ట వరకు పాత జాతీయ రహదారి–44 నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.65 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో అక్టోబర్ నెలలో పనులకు శంకుస్థాపన చేశారు. అదే నెలలో పనులను కూడా ప్రారంభించారు. రెండు నెలల పనులు వేగంగా సాగాయి. ఆ తర్వాత అటు వైపు కన్నెత్తి చూసే వారు లేరు. అసలు తారు వేస్తారా లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్న దారిని తవ్వి కంకర వేసి కాలు తీసి కాలువ వేయరాకుండా చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకుల వద్దకు వీడీసీ సభ్యులు పలుమార్లు వెళ్లినా ఇప్పటి వరకు పనుల్లో కదలిక రాలేదు. మల్లన్న గుట్టపై మాఘ పౌర్ణమి(ఈ నెల 24న) జాతర నిర్వహిస్తారు. ఈ నెల 23 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గ్రామం నుంచి సీడే(రథం) గుట్ట వరకు తీసుకెళ్తారు. ఉత్సవాల్లో భాగంగా గుట్ట చుట్టూ సీడేను తిప్పుతారు. రోడ్డు పూర్తిగా కంకరమయంగా ఉంటే సీడే తీసుకుపోవడం ఎట్లా అంటూ గ్రామస్తులు మదన పడుతున్నారు. అధికారులు స్పందించి ఉత్సవాల ప్రారంభం నాటికైనా తారు రోడ్డు వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. మా దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వినీత్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ

గ్రామ దేవతలకు జలాభిషేకం



ఆలూర్‌లో గంగా జలాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



జలాభిషేకానికి బయలుదేరిన ఆరు పంతాల సదర్లు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గంగా జలాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గోదావరి పరివాహక ప్రాంతం నుంచి తీసుకు వచ్చిన గంగా జలాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్వసమాజ్ ఆధ్వర్యంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఆరు పంతాల సదర్లతో కలిసి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. నల్లపోచమ్మ, మహాలక్ష్మి, ముత్యాలమ్మలతో పాటు అన్ని దేవతల వద్ద డప్పువాయిద్యాలతో తిరుగుతూ జలాభిషేకం చేశారు. సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, ఆరు పంతాల సదర్లు, పెద్దమనుషులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ అన్నారు. పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో శ్రమదానం నిర్వహించారు. కాలనీవాసులతో కలిసి రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. చెత్తను మున్సిపల్ చెత్త బండిలో వేయాలని, రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయొద్దని స్థానికులకు సూచించారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, కార్యదర్శి ఎల్. సాయన్న, చింత నరహరి, తదితరులు పాల్గొన్నారు.



శుభ్రపరుస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

- జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్

మాక్లూర్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులకు దూరంగా ఉంటామని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎంపీడీవో జె క్రాంతి ఆధ్వర్యంలో మాందాపూర్‌లో జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో విషజ్వరాలు రావటానికి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటం, కాల్వలు, గుంతల్లో నీరు నిలిచి దోమలు పెరిగిపోవటం ద్వారా మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అలవర్చుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారి కిరణ్ దేశ్‌పాండే, మాజీ సర్పంచ్ సులోచన, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మోరా లిఫ్ట్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అనంతరం గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకుని లక్మాపూర్ వద్ద నిర్మిస్తున్న ధర్మోరా లిఫ్ట్ నిర్మాణ పనులను విఠల్‌రావు పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వచ్చే మే నాటికి లిఫ్ట్ పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జె క్రాంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కార్యాలయం



కార్యాలయంపై పెరిగిన మొక్కలు

- 60 ఏళ్ల క్రితం నిర్మాణం
- పెచ్చులూడుతున్న స్లాబ్
- పట్టించుకోని ప్రభుత్వాలు



పెచ్చులూడిన ఈఈ కార్యాలయం

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 1963 ఫిబ్రవరి 7న కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాని సరైన నిర్వహణ లేకపోవడం, కాలం చెల్లడంతో రోజు రోజుకు శిథిలావస్థకు చేరుకుంది. పెద్ద బంగ్లా ఉంది కాని ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. జీవీసీ(గోదావరి వ్యాలీ సర్కిల్)లో డివిజన్ –1 విభాగం ఇక్కడి నుంచే కార్యక్రమాలను నిర్వహిస్తుంది. కార్యాలయ భవన స్లాబ్ అంతటా పెచ్చులూడుతుంది. దీంతో అధికారులు విధులు నిర్వహించటానికి జంకుతున్నారు.

నిర్వహణ లేకపోవడంతో..

ఎస్సారెస్పీ క్వార్టర్లు, కార్యాలయ భవనాలు కాలం చెల్లిన భవనాలుగా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు గతంలోనే నివేదిక ఇచ్చారు. అయిన వాటిలోనే కొనసాగిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో రోజు రోజుకు సిబ్బంది తగ్గడం, డివిజన్‌లు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లడం సాకుగా చూపి కార్యాలయ భవన నిర్మాణాన్ని పట్టించుకోవడం మరిచారు. ప్రతి ఏటా నిర్వహణకు నిధులు కూడా మంజూరు చేయడం మరిచారు. ఫలితా మరింత శిథిలావస్థకు చేరుకుంటుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయ భవనం చుట్టూ గోడలపై రాగి మొక్కలు పెరుగుతున్నాయి. కనీసం వాటిని కూడ తొలిగించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. మొక్కులు పెరిగి గోడలు నెర్రెలు పారే ప్రమాదం ఉంది. అయినా పట్టించుకోవడం లేదు.

ప్రతిపాదనలు పంపించాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయ భవన మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. భవనం శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. ఉన్నత అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



బోధన్‌టౌన్(బోధన్): వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టాఫీసు వద్ద గల వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కంటాల రమేష్, కోశాధికారి పబ్బ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు కల్యాణ వేంకటేశ్వరుడు ముస్తాబు



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలకు ముస్తాబయ్యాడు. సోమవారం నుంచి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జాతర నిర్వహించనున్నారు.

13న రైతాంగ సమస్యలపై సదస్సు

మాక్లూర్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 13న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్టు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రధానంగా బోధన్ చక్కెర పరిశ్రమ పున: ప్రారంభంపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఇతర అంశాలను చర్చించేందుకుగాను ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సు జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో ఆదివారం అంబేడ్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అబ్బ రాజేశ్వర్ స్మారక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. సుప్రీం కోర్టు న్యాయవాది, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉషి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబడ్డీలో సుర్బిర్యాల్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడానికి రాష్ట్ర అసోసియేషన్ తరపున అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ రాజేశ్వర్, మోహన్‌దాస్, అబ్బ దిలీప్, మునిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అరవై ఏళ్ల పండుగకి ముస్తాబు



గీతాశ్రమంలో ముస్తాబైన ఆలయం

బాల్కొండ: కిసాన్‌నగర్‌లో గల గీతా ఆశ్రమం అరవై ఏళ్ల పండుగకి ముస్తాబవుతోంది. 1964లో సత్యానంద మహర్షి స్థాపించిన ఆశ్రమమమే గీతా ఆశ్రమం. అప్పటి నుంచి దాతల సహకారంతో అంచెలంచెలుగా ఎదుగుతోంది. ఆశ్రమంలో ప్రతి రోజు గీతా పారాయణం, భజన కీర్తనలు, నిత్య పూజలు జరుగుతుంటాయి. అరవై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 16 నుంచి ఆశ్రమంలో ఆశ్రమ ఉత్సవాల్లో భాగంగా మహాజన సభలను నిర్వహిస్తున్నారు. అందు కోసం ఆశ్రమంలో ఉన్న శ్రీ కృష్ణ మందిరాన్ని అందంగా అలంకరించారు. అరవై ఏళ్ల పండుగ కోసం దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేపడుతున్నాం

ఆశ్రమంలో అరవై ఏళ్ల పండుగ నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నాం. దాతల సహకారంతో రంగులు వేయడం పూర్తి చేశాం. ఉత్సవాల నాటికి అంతా సిద్ధం చేస్తాం. –సువందిత తీర్థ స్వామి, కిసాన్‌నగర్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉండి బీజేపీ గెలుపు కోసం పని చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండలంలో పర్యటించిన ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా నా గెలుపు ప్రతీ బీజేపీ కార్యకర్త గెలుపుగానే భావిస్తున్నానని అన్నారు. ఎవరు కూడా డబ్బుకు లొంగకుండా పార్టీ జెండాను భుజంపై మోసి నిబద్ధతతో పని చేశారని అన్నారు. రౌడీలు బెదిరింపులకు గురి చేసినా, అక్రమ కేసులు పెట్టినా పార్టీలు మారకపోవడం నిజమైన గొప్పతనమన్నారు. ఇక నుంచి కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని, కష్టసుఖాల్లో ముందుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు జీజీ నడ్కుడలో జరుగుతున్న అగ్గి మల్లన్న జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, ఎంపీటీసీలు సంజీవ్, చిన్నారెడ్డి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి పాటుపడాలి

వర్ని: సహకార సంఘాల్లో అవినీతికి తావివ్వకుండా రైతుల అభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన జాకోర సహకార సంఘం అధ్యక్షుడు దశరథ్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్ రెడ్డి మాట్లాడారు. గత పాలకవర్గం చేసిన విధంగా అవినీతి అక్రమాలకు తావు ఇవ్వకుండా రైతే అభివృద్ధి లక్ష్యంగా సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. చిన్న సన్నకారు రైతులకు రుణాలు ఇప్పించి వ్యవసాయ రంగం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా ఇప్పటికే రెండిటిని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. మిగతా నాలుగు గ్యారంటీల అమలుకు మంత్రివర్గం సన్నాహాలు చేస్తుందని, రైతులకు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రమాణ స్వీకార సమావేశంలో రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాసరావు, పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన దశరథ్, చందూర్ వైస్ ఎంపీపీ దశగౌడ్, బాన్సువాడ మాజీ జెడ్పీటీసీ రత్నకుమార్, మోస్రా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, వర్ని మండల అధ్యక్షుడు సురేష్ బాబా, తదితరులున్నారు.



జాకోర సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న దశరథ్



రోడ్లపై ఆవులు

- ప్రయాణికులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్: రోడ్లపై ఆవులను ఇష్టానుసారంగా వదిలేయడంతో ఇటు ప్రయాణికులతో పాటు ఆవులు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆర్మూర్ పట్టణంలో ఎక్కడ చూసినా ఆవులు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. ఉదయం పూట వదిలేస్తే దుకాణాలు దారులు, ఇళ్లలో ఉండే మహిళలు ఆహారం అందిస్తారనే ఆలోచనతో ఆవుల యజమానులు వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఆవులు రోడ్లపై తిరుగుతూ, వాహనదారులు, పాదచారులకు అడ్డంగా వస్తున్నాయి. దీంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. పట్టణంలోని పాతబస్టాండ్, జిరాయత్‌నగర్, కొత్త బస్టాండ్, పెర్కిట్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఆవులు గుంపులుగా ఉంటున్నాయి. గత నెలలో రోడ్డు ప్రమాదంలో రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. రోడ్లపై వదిలేసిన ఆవుల యజమానులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని, అధికారులు స్పందించి గోశాలలను ఏర్పాటు చేసి ఆవులను అక్కడికి చేర్చాలని పుర ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదంలో మృతిచెందిన ఆవుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కాలనీవాసులు(ఫైల్)

గల్ఫ్ బాధితులకు కేంద్రం అండగా ఉంటుంది



మాట్లాడుతున్న కంచెట్టి గంగాధర్

ఆర్మూర్: గల్ఫ్ బాధితులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్ పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్ దుబాయిలోని బల్దియా కార్మికులను ఆదివారం కలిశారు. దుబాయిలోని కురుపఖాన్ ప్రాంతంలో తెలంగాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్మూర్ ప్రాంతానికి చెందిన పుప్పాల శ్రీనివాస్, బాదుగుణ సంతోష్, ఆరేపల్లి నరేష్‌లతో చర్చించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కెమెరామెన్ (తెలుగు) - 2.45 హనుమాన్ (తెలుగు) - 6.00 తేరి బాతోమే (హిందీ) - 9.20
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) - 11.20, 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	ఈగల్ (తెలుగు) - 10.10 యాత్ర-2 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	యాత్ర-2 (తెలుగు) - 10.05 తేరి బాతోమే (హిందీ) - 4.15